**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ 19.02.2025 సమయం 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1. నదీ జలాల కేటాయింపు, పంపిణి రాష్ట్ర నీటి సమస్యలను పరిష్కరించడంలో జోక్యం చేసుకుంటామని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ హామీ ఇచ్చారు.**

**2. గత ఏడాదిలో వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన ఐదు రాష్ట్రాలకు జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి నుండి కేంద్రం సుమారు వెయ్యి 554 కోట్ల రూపాయలను మంజూరు చేసింది.**

**3. రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం తక్కువ పరిహారం నిర్ణయించటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.**

**4. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి బిజెపి, బీఆర్ఎస్ లు కుమ్మక్కయ్యారని టిపిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.**

**UTTAM:**

**నదీ జలాల కేటాయింపు, పంపకాలపై, అలాగే రాష్ట్ర నీటి సమస్యలను పరిష్కరించడంలో జోక్యం చేసుకుంటామని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. రాష్ట్రంలోని కీలక నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈరోజు రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరుగుతున్న రెండవ అఖిల భారత జల శాఖ మంత్రుల సమావేశం సందర్భంగా తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర**

ప్రాజెక్టుల పరిస్థితి, ఇతర ఆందోళనల గురించి కేంద్ర మంత్రికి వివరించగా ఆయన  ఈ మేరకు హామీ ఇచ్చారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుత రబీ సీజన్ లో శ్రీశైలం, నాగార్జున సాగర్ మిగులు నీటిని అక్రమంగా వాడుకుంటోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారు. అనధికారికంగా నీరు వాడుకోకుండా అరికట్టడానికి కేంద్రం తక్షణం చర్యలు తీసుకుంటుందని సిఆర్ పాటిల్ హామీ ఇచ్చారు. ఇలా ఉండగా, జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి దేబాశిష్ ముఖర్జీతో జరిగిన చర్చల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డి జల వివాదాల పరిష్కారానికి, కీలకమైన ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

**FLOOD ASSISTANCE:**

గత ఏడాది కాలంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాలకు జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (NDRF) నుండి కేంద్రం వెయ్యి 554 కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి కమిటీ ఈ కేంద్ర సహాయాన్ని ఆమోదించింది. తెలంగాణకు 231 కోట్ల రూపాయలకు పైగా, ఆంధ్రప్రదేశ్‌కు 608 కోట్ల రూపాయలు, నాగాలాండ్‌కు 170 కోట్లకు పైగా, ఒడిశాకు 255 కోట్లకు పైగా, త్రిపురకు 288 కోట్ల రూపాయలకు పైగా నిధులు ఆమోదించినట్లు హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (SDRF) కింద కేంద్రం ఇప్పటికే రాష్ట్రాలకు కేటాయించిన నిధులకు అదనంగా ఈ సహాయం అందిస్తున్నట్లు హోంమంత్రిత్వ శాఖ తెలిపింది.

**ఈటల రాజేందర్**

రాష్ట్రంలో  లో గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం తక్కువ పరిహారం నిర్ణయించటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. నేషనల్ హైవే కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని, ఇందుకు కేంద్రం డబ్బులు చెల్లిస్తుందని అన్నారు., దీనికోసం  రాష్ట్ర ప్రభుత్వం సరైన ధర నిర్ణయించలేదని, ఫలితంగా రైతులకు నష్టం

జరుగుతుందని పేర్కొన్నారు. వరంగల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ... గ్రీస్ ఫీల్డ్ హైవే పనులు వేగంగా జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. అభివృద్ధికి బిజెపి వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

పిటిసి, వరంగల్

**CEC:**

భారత నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్గా జ్ఞానేష్ కుమార్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. నిన్న తన పదవీకాలం పూర్తి చేసుకున్న రాజీవ్ కుమార్ స్థానంలో  జ్ఞానేష్ కుమార్ న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్లో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మాట్లాడుతూ... దేశ నిర్మాణానికి అందించే సేవలో మొదటి అడుగు ఓటు వేయడం అని, 18 ఏళ్లు నిండిన ప్రతి  పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎల్లప్పుడూ ఓటు వేయాలని సూచించారు. 1988 బ్యాచ్ కేరళ కేడర్ కు చెందిన ఐఏఎస్ అధికారి జ్ఞానేష్ కుమార్ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పని చేశారు.

**TRIBUTES:**

ఈరోజు చత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. రేవంత్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి శివాజీ చిత్రపటానికి నివాళులు అర్పించారని ఒక అధికారిక ప్రకటలో తెలిపారు. బిజెపి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాంచంద్రారెడ్డి, ఇతర నాయకులు ఛత్రపతి శివాజీకి పుష్పాంజలి ఘటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, తదితర నాయకులు కూడా నివాళులర్పించారు. ఇలా ఉండగా, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఛత్రపతి శివాజీ మహరాజ్ కు నివాళులర్పించారు.

**BRS:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పని చేయాలని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత చంద్రశేఖరరావు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో చంద్రశేఖరరావు మాట్లాడుతూ... పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించాలని చెప్పారు. మరోవైపు పార్టీ సభ్యత్వ నమోదుకు ఇన్‌ఛార్జ్‌గా మాజీ మంత్రి హరీశ్ రావుకు బాధ్యతలు అప్పగించారు.

**హైదరాబాద్ కలెక్టర్**

రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శ్రీరామ్ నగర్ పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఈరోజు జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రి లోని ఫార్మసీ, ప్రాథమిక పరీక్ష కేంద్రం, ఎక్స్ రే, ఈసీజీ గదులను పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవల గురించి వైద్య సేవల కోసం వచ్చిన గర్భిణీలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పిటిసి, హైదరాబాద్

**MAHESH GOUD:**

బిఆర్ఎస్, బిజెపి లు రాష్ట్రంలో రాబోయే ఎంఎల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడానికి 'రహస్య ఒప్పందం' కుదుర్చుకున్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్

కుమార్ గౌడ్ ఈరోజు ఆరోపించారు. కరీంనగర్ నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎంఎల్సి స్థానానికి ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 2024 సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే, రాబోయే ఎంఎల్సి ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్ మరోసారి బిజెపి అభ్యర్థులకు పరోక్షంగా మద్దతు ఇస్తోందని మహేష్ గౌడ్ అన్నారు. మతం పేరుతో బిజెపి ఓట్లు అడిగేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. గత ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం 55 వేల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయగా, బిఆర్ఎస్ పార్టీ దశాబ్దంలో 50 వేల ఉద్యోగాలను మాత్రమే కల్పించిందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

## నీటి నాణ్యత ప్రయోగశాల

భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో ఇటీవల సంచార నీటి నాణ్యత ప్రయోగశాలను ప్రారంభించామని, దీని ద్వారా నీటి నాణ్యతను పరిశీలించి నీరు వ్యవసాయానికి, తాగునీటికి ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలుపుతున్నామని నిర్మల్ జిల్లా భూగర్భ జల శాఖ అధికారి శ్రీనివాస్ బాబు ఆకాశవాణికి తెలిపారు.

పిటిసి, నిర్మల్

## REVISED-LIC:

పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చేందుకు LIC తమ పాలసీల పోర్ట్ ఫోలియో అభివృద్ధి, విస్తరణపై నిరంతరం దృష్టి సారిస్తోందని సంస్థ తెలంగాణ జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ చెప్పారు. కొత్తగా ప్రవేశపెట్టిన పాలసీ LIC స్మార్ట్ పెన్షన్ ప్లాన్ - నంబర్: 879 పోస్టర్‌లను ఆయనీరోజు విడుదల చేశారు. పెట్టుబడిపెట్టిన మొత్తానికి పాలసీ ద్వారా పెన్షన్‌గా రిటర్న్ లను కోరుకునే కస్టమర్‌ల అవసరాలను ఈ పాలసీ తీరుస్తుంది. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ, సురక్షితమైన పదవీ విరమణ, పెన్షన్ ప్లాన్‌ల కోసం రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోందనీ, ఇందుకోసం LIC స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ను ప్రత్యేకంగా రూపొందించిందనీ చెప్పారు.

**మహిళా సాధికారత కేంద్రం**

పెద్దపల్లి జిల్లాలో మహిళా సాధికారత కేంద్రం పరిధిలో ఆడపిల్లలు, మహిళల కోసం వివిధ శాఖల సమన్వయంతో అనేక కార్యక్రమాలు చేపట్టామని కో-ఆర్డినేటర్ అరుణ తెలిపారు. వివిధ కారణాల వల్ల మధ్యలో చదువు ఆపేసిన అడపిల్లలని ఓపెన్ స్కూల్ లో తిరిగి చేర్పించామని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వితంతువులకు వివిధ ఎన్జీవో ల సహాయంతో కుట్టు మెషీన్ లు అందించామని ఆకాశవాణి ప్రతినిధి సంతోష్ కుమార్ కి తెలిపారు. భేటీ బచావో భేటీ పడావోలో భాగంగా పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టామని చెప్పారు.

పీటీసీ, పెద్దపల్లి